


శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు

# మోక్షద్వారపాలకులు



శ్రీ శుకబ్రహ్మాశ్రమము
శ్రీకాళహస్తి,

1991 [వెల 8-00

## దైవప్రార్థన

కరుణామూర్తియగు సర్వేశ్వరా! మా చిత్తము సర్వకాల సర్వావస్థల యందును నీ పాదారవిందముల యందు లగ్నమై అచంచలమైన భక్తితో కూడి యుండునట్లు అనుగ్రహింపుము.

పరమ దయానిధీ! ప్రాతఃకాలమున నిద్రలేచినది మొదలు మరల పరుండు వఱకును మనోవాక్కాయములచే మా వలన ఎవరికిని అపకారము కలుగకుండునట్లును, ఇతర ప్రాణికోట్లకు ఉపకారము చేయులాగుగను సద్బుద్ధిని దయచేయుము.

సచ్చిదానందమూర్తీ! నిర్మలాత్మా! మా యంతఃకరణమునందు ఎన్నడును, ఏ విధమైన దుష్టసంకల్పముగాని, విషయ వాసనగాని, అజ్ఞాన వృత్తిగాని, జొరబడకుండునట్లు దయతో అనుగ్రహింపుము.

వేదాంత వేద్యా! అభయస్వరూపా! మా యందు భక్తి, జ్ఞాన, వైరాగ్యబీజము లంకురించి శీఘ్రముగ ప్రవృద్ధములగునట్లు ఆశీర్వదింపుము. మరియు ఈ జన్మమునందే కడతేరి నీ సాన్నిధ్యమున కేతెంచుటకు వలసిన శక్తి సామర్థ్యములను కరుణతో నొసంగుము.

దేవా! నీవు భక్తవత్సలుడవు! దీనులపాలిటి కల్పవృక్షమవు! నీవు తప్ప నాకింకెవ్వరు దిక్కు? నిన్ను ఆశ్రయించితిని. అసత్తునుండి సత్తునకు గొనిపొమ్ము. తపస్సు నుండి జ్యోతిలోనికి తీసుకొని పొమ్ము! మృత్యువు నుండి అమృతత్వమును పొందింపజేయుము! ఇదే మా వినతి అనుగ్రహింపుము. నీదరి జేర్చుకొనుము.

పాహిమాం పాహిమాం పాహిమాం పాహి!!

ఓం తత్ సత్.

శ్రీ శ్రీ శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు.

# మోక్షద్వారపాలకులు



రచయిత:

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

శ్రీ శుకబ్రహ్మాశ్రమము
శ్రీ కాళహస్తి-517640. చిత్తూరు జిల్లా

1991

రెండవ కూర్పు :
1984 మార్చి వరకు 2000 ప్రతులు
మూడవ కూర్పు :
1989 జనవరి, 1000 ప్రతులు
నాల్గవ కూర్పు :
1991 జూలై, 2000 ప్రతులు



ప్రతులకు :
మేనేజరు phone : 239
శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము పోస్టు,
శ్రీ కాళహస్తి, (చిత్తూరు జిల్లా), (ఆం. ప్ర)
Pin : 517 640

ముద్రణ :
శ్రీ క్రిష్ణచిత్ర ప్రింటర్స్,
4, నాగేశ్వరరావు రోడ్,
టి నగర్, మద్రాసు-600 017
ఫోన్ : 441286

# మోక్షద్వారపాలకులు

పెద్ద పెద్ద భవనములందును, రాజ ప్రాసాదములందును ముఖద్వారములయొద్ద అహర్నిశము కొందరు ద్వారపాలకులు ఉందురు. ఎవరైన లోనికి పోదలంచుచో వారియొక్క అనుమతిని పొందవలెను. వారి సమ్మతి లేనిచో ఎవరును లోపలికి పోజాలరు; వారియొక్క అనుమతిని బడిసినవారు, వారిని మంచి చేసికొనినవారు మాత్రమే భవనములోనికి పోగల్గుదురు.

ప్రతి జీవియు మోక్షసౌధములోనికి ప్రవేశించి అచట గల అక్షయ పరమాత్మను సందర్శించి పరమానందమును అనుభవింపవలెనని కుతూహలపడుచున్నాడు. కాని ద్వారపాలకులు అనుమతించటంలేదు. నలుగురు ద్వారపాలురు మోక్షసౌధముకడ అహర్నిశలు కావలి గాచుకొందురు. తమ్ము మంచిచేసుకొనిన వారిని మాత్రమే వారు లోనికి పోనిచ్చుదురు. అందులో మొదటి 'ద్వారపాలకుడు శమము. ఎవరు తమ జీవితకాలములో శమమును అనగా ఇంద్రియ నిగ్రహమును సుగుణమును చక్కగ సేవించుదురో. ఎవరు తమ తమ ఇంద్రియాదులపై అదుపుగలిగి వర్తించుదురో అట్టివారికి మోక్షద్వారము అమాంతముగ తెరువబడును. మోక్షసౌధముకడ వారికి చక్కని సన్మానము లభించును.

వారు మోక్షద్వారముకడకు రాగానే మొదటి ద్వారపాలకుడగు శమము ద్వారమును ఉద్ఘాట మొనర్చి సగౌరవముగ, రాజమర్యాదలతో మోక్షసౌధాంతరాళములోనికి వారిని గొనిపోయి పరమాత్మయను ప్రభువును సందర్శింపజేయును. కావున ముముక్షువులందఱును తమ జీవిత కాలములో శమమను మొదటి ద్వారపాలకుని సేవించుటకై తీవ్రతర యత్న మాచరింపవలయును.

సామాన్యముగా శాస్త్ర విచారణయందు శమము, దమము అను రెండు పదములు తఱచుగా వచ్చుచుండును. శమమనగా అంతరేంద్రియ నిగ్రహమని, దమ మనగా బాహ్యేంద్రియ నిగ్రహమని వాడుకలో కలదు. కాని ప్రథమ మోక్ష ద్వారపాలకుడైన శమమునకు సర్వేంద్రియ నిగ్రహ ఇంద్రియముల రెండిటియొక్క సంయమమే శమము. త్వక్చక్షుశ్శ్రోత్ర జిహ్వాఘ్రాణములను పంచ జ్ఞానేంద్రియములు, వాక్పాణిపాదపాయూపస్థములను పంచ కర్మేంద్రియములు కలిసి బాహ్యేంద్రియములనియు, మనస్సునుదిఅంతరేంద్రియ మనియు చెప్పబడును. ఈ ఏకాదశేంద్రియములను వశమునందుంచు కొనుటయే శమమను మొదటి ద్వారపాలకుని సేవించుట యగును.

అయితే అట్టి ఇంద్రియనిగ్రహము (శమము) యొక్క అవసరమేమని కొందరు ప్రశ్నించవచ్చును. శరీరమను రథ



మును ఇంద్రియములను గుఱ్ఱములు మోక్షమను గమ్యస్థానమునకు లాగుకొని పోవుచున్నవి. ఆ గుఱ్ఱములు మదించినవై, తమ ఇష్టము వచ్చినట్లు లాగుకొని పోయినచో తుదకు రథమును ఏ గోతిలోనో పడవైచి జీవుడను రథికునకు అవి అపాయము తెచ్చిపెట్టును. అందుచే బుద్ధి అను సారథి ఒకింత వివేక మవలంభించి మనస్సను పగ్గమును బట్టి లాగి ఆ యింద్రియములను గుఱ్ఱములను సవ్యమైన మార్గమున నడిపించినచో పరమాత్మయను గమ్యస్థానమును నిరాటంకముగ చేర్చగలడు. కావున ఆత్మ సాక్షాత్కారమునకై ఇంద్రియ నిగ్రహము అత్యావశ్యకమని తెలుచున్నది. కనుకనే గీతలో భగవానుడు—

'తస్మాత్త్వ మిన్ద్రియాణ్యాదౌ నియమ్య భరతర్షభ' అని వక్కాణించి ఇంద్రియ నిగ్రహమును మొట్టమొదటనే సాధించులాగున ఆదేశించెను. 'ఆదౌ' (= మొట్టమొదట) అను పదముయొక్క ప్రయోగముచే ఇంద్రియ సంయమము యొక్క అత్యావశ్యకత తేటతెల్లమగుచున్నది.

ప్రభుత్వమువారు అపుడపుడు ధరలపై 'కంట్రోలు' విధించుదురు. అట్లు ధరలను అదుపులో నుంచనిచో అవి పెరిగి సామాన్యులకు బాధాకరములుగ పరిణమించునని వారి భావము. అట్లే రైల్వేవారు నడుపు ప్రతి రైలుబండియు 'కంట్రోల్' అధికారుల అదుపు ఆజ్ఞలకు లోబడియే నడుచు

చుండును. మిలిటరీ శాఖలో గాని, పోలీసుశాఖలో గాని ప్రతి సైనికుడు, ప్రతి రక్షకభటుడు తమ అధిపతి యొక్క నాయకుని యొక్క అదుపాజ్ఞలలోనే ప్రవర్తించుచుండును. ఈ ప్రకారముగ 'కంట్రోల్' లేనిచో, క్రమశిక్షణ లేనిచో ఏ శాఖయు చక్కగ జరుగదు. ఇక పరమార్థ రంగమున వేఱుగ చెప్పవలయునా ?

జన్మ జన్మాంతరములనుండి బాగుగ విషయజాలమును అనుభవించుచు, భోగములలో మునిగి తేలుచు. దృశ్య సౌఖ్యములే పరమావధియని భావించుచు మదించియున్నట్టి ఇంద్రియముల యొక్క కైపును ఈ మానవజన్మలోనైన ఒక్కింత అదుపులో పెట్టనిచో ఇక జీవితముయొక్క ప్రయోజన మేమి ? పశుపతి (శివుడు) గా రూపొందవలసిన మానవుడు పశువుగా ప్రవర్తించుట చాల ఘోరముకదా ! కావున బుద్ధి వికాసముతో గూడి పెక్కు అనుకూల అవకాశములు కలిగియున్న ఈ మానవ జీవితమును చతుష్పదజీవుల భంగి భ్రష్ట మొనర్పక, మనస్సును, ఇంద్రియములను, ఇంద్రియార్థములపై పరుగిడనీయక. పగ్గముపట్టిలాగి సంసార ప్రవాహములో కొట్టుకొనిపోవు జీవితనౌకకు లంగరు వేసి, దైవోన్ముఖముగ నొనర్చి కడతేరుట జనుల విధ్యుక్తధర్మము, కామక్రోధముల వేగమును జీవితాంతము లోపలనే అరికట్టి ధన్యులు కండని గీతాచార్యుడు భేరీ మ్రోగించి చెప్పుచున్నాడు. కావున



ఇంద్రియములపై అదుపు చాల అవసరము. దీనినే శమమని చెప్పుదురు,

విషయవాసనలుగల జీవునకు ధ్యానకాలమున మనస్సు ఏమాత్రము నిలుకడలేక బయటకు పరుగెత్తుచు విచ్చలవిడిగ సంచరింప నారంభించును. అత్తఱి సమాధినిష్ఠ జరుగనే జరుగదు.

భోగైశ్వర్య ప్రసక్తానాం తయాపహృతచేతసామ్
వ్యవసాయాత్మికాబుద్ధి స్సమాధౌ న విధీయతే

అను శ్లోకముద్వారా శ్రీకృష్ణమూర్తి ఈ భావమునే స్పష్టీకరించెను. ధ్యానకాలమున మనస్సు ఏకాగ్రముగ నుండనిచో ఆత్మానంద మనుభూతము కానేరదు. మనస్సు ఏకాగ్రముగ నుండవలెననిన ఇంద్రియములు బహిర్వ్యాపారమును మాని. శబ్దస్పర్శాది విషయములపై పరుగిడక అంతర్ముఖములు కావలెను. అంతర్ముఖములు కావలెననిన, విషయాదులందు దుఃఖదోషానుదర్శనమును గావింపవలెను, విషయములు నశ్వరములని, పరిణామమున దుఃఖమునే కలుగజేయునని, దైవమార్గమున అవి ప్రతిబంధములని వివేకముచే బాగుగ నిశ్చయించి దృశ్యచింతనను వీడవలెను. అట్టి వైరాగ్యభావనచే ఇంద్రియములు, మనస్సు బాహ్యవ్యాపారములనుండి మఱలి అంతర్ముఖములై ఆత్మధ్యానమున

కెంతయో సహాయకారులు కాగల్గును. కాబట్టి ఇంద్రియ నిగ్రహము, మనస్సంయమము జీవునకు అత్యంతావశ్యకమని తేలుచున్నది. దీనినే శమమని చెప్పుదురు. ఇట్టి శమమను మోక్షద్వారపాలకుని జనులు శ్రద్ధాపూర్వకముగ సేవించి, ఆదరించి తత్ఫలితముగ మోక్షసౌధమందు నిరాటంకముగ ప్రవేశించి ప్రభుదర్శనముచే పరమానంద మనుభవింతురు. గాక!

మోక్షసౌధముయొక్క రెండవ ద్వారపాలకుడు 'విచారణ' జీవితకాలములో ఒకింతైనను ఆత్మ విచారణ సలిపినవానికి, 'విచారణ' యను ద్వారపాలకుని మంచిచేసి కొనినవానికి ఆ ద్వారపాలకుడు మోక్షసౌధకవాటమును ఉద్ఘాటన మొనర్చివేసి పరమాత్మయను ప్రభువును సందర్శింప జేయును. సంసార దుఃఖమును తరింపదలంచువానికి తత్త్వ విచారణ అత్యంతావశ్యకము. భ్రాంతిలోపడి తల్లడిల్లుచున్న వానికి విచారణతప్ప వేఱు శరణ్యమేదియును లేదు.

తాటిని జూచి పామని భయపడువానికి, ఎండమావులను జూచి నీరని భ్రమించువానికి, రాత్రికాలమున చెట్టు మోడును చూచి దొంగని భ్రాంతి నొందువానికి విచారణ తప్ప మఱియేది శాంతి చేకూర్చగలదు? అట్లే సచ్చిదానంద స్వరూపుడై, నాశరహితుడై సర్వవ్యాపకుడైయున్న జీవుడు తాను అల్పమైన దేహమను భ్రమలో చిక్కుకొనినపుడు



విచారణ యొకటియే అతనిని గట్టెక్కించగలదు. కనుకనే శాస్త్రకారులు విచారణకు గొప్ప ప్రాముఖ్యత నొసంగిరి. ఈ విచారణనే బుద్ధియోగమనియు, వివేకమనియు అందురు.

రెండు వస్తువులు కలిసిపోయినపుడు, విచారణచే వాటిని వేఱుచేసి మంచి వస్తువును గ్రహించుట, చెడ్డ వస్తువును వదలుట విజ్ఞుల కర్తవ్యము. అరటిపండులో గుజ్జు, తొక్క అను రెండు వస్తువులు కలిసియున్నవి. వివేకము కలవాడు, యుక్తాయుక్తములను చక్కగ వివేచన చేసి గుజ్జును తొక్కనుండి వేఱుచేసి గుజ్జును స్వీకరించి తొక్కను పారవేయును. బియ్యము రాళ్ళు కలిసియున్నప్పుడు రాళ్ళను చెరిగివేసి బియ్యము మాత్రము స్వీకరించుదురు. పాలు నీళ్ళు కలిసియున్నపుడు హంస ఆ రెంటిని తన ముక్కుతో వేఱుచేసి పాలను స్వీకరించి నీటిని విడిచివేయును. అట్లే పరమహంసలగు వివేకులు సత్యాసత్యములు క్షేత్ర క్షేత్రజ్ఞులు, దృగ్దృశ్యములు కలిసియున్న ఈ ప్రపంచమును తత్త్వ విచారణచే చక్కగ వివేచించి, విభజించి దృశ్యముపై ఆసక్తిని వీడి దృగ్రూపమగు పరమాత్మనే స్వీకరించి తదేక పరాయణులై వర్తించుదురు, కనుకనే గీతాచార్యుడగు శ్రీ కృష్ణపరమాత్మ భగవద్గీతలో జ్ఞానషట్కమును వివరించునపుడు విభాగయోగములు పెక్కింటిని చెప్పుకొనుచు పోయెను.

1. క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగయోగము.

2. గుణత్రయ విభాగయోగము.

3. దైవాసుర సంపద్విభాగయోగము.

4. శ్రద్ధాత్రయ విభాగయోగము.

విభాగ మనగా వేఱుచేయుట. మంచి, చెడ్డ, ధర్మము, అధర్మము, సారము, అసారము కలిగియున్నపుడు వాటిని వేఱుచేయుట అత్యవసరము. ఈ శరీరమందుగాని, శరీరమునకు బయటగాని రెండు వస్తువులు కలిసియున్నవి. వాటినే ఆత్మ, అనాత్మ యనియు, క్షేత్రజ్ఞుడు క్షేత్రము అనియు అందురు. విజ్ఞుడగువాడు చక్కని వివేకమును ఆశ్రయించి ఈ శరీరమును విభజించి పంచకోశాంతర్గతుడగు పరమాత్మను తెలిసికొని, సాక్షాత్కరించుకొని ఆతడే తానని భావించి. జడమగు దేహముపైనను, బయటగల నామరూపములపైనను అహంభావము గాని మమత్వము గాని లేకుండును. ఇక్కార్యమును సాధించుటలో విచారణ ఎంతయో ఉపకరించును. విచారణచే పంచకోశములను విభజించి, 'నేతి, నేతి' (ఇదికాదు, ఇదికాదు) అను పద్ధతి ద్వారా అనాత్మను వేఱుచేసి శేషించిన ఆత్మస్వరూపమును అనుభూత మొనర్చుకొనవలెను.



శ్రీ వసిష్ఠులవారు శ్రీరామచంద్రునకు బోధించిన ఈ క్రింది హితవాక్యము ముముక్షువులకు శిరోధార్యమై యున్నది.

మనాగపి విచారేణ చేతసః స్వస్య నిగ్రహః
మనాగపి కృతో యేవ తేనాప్తం జన్మనః ఫలమ్.

'ఒకింత విచారణచే నైనను ఎవడు తన మనస్సును కొంచమైనను నిగ్రహింపగల్గునో సత్యమును ఎఱుంగగల్గునో అతడు జన్మసాఫల్యము నొందినట్లే యగును. కావున తత్త్వ విచారణ సాధనకు అత్యంతావశ్యకమై యున్నది. కనుకనే అది మోక్షద్వారపాలకుడుగ శాస్త్రములందు వర్ణింపబడినది. జీవితమునందు శాంతి ననుభవింపదలంచువారు, మోక్ష సౌధము నధిరోహించి ఆత్మరూప ప్రభువుయొక్క సాక్షాత్కారము నొంద దలంచువారు, జనన మరణరూప శృంఖలములనుండి తప్పించుకొని శాశ్వత సౌఖ్యము ననుభవింపగోరువారు తమ జీవితకాలమున శీఘ్రముగ ఇట్టి విచారణను జేపట్టి. తత్త్వం పదార్థ శోధనను గావించి అనిత్యమునుండి నిత్యమును వేఱుచేసి. అట్టి నిత్యవస్తువగు ఆత్మయే తానని దృఢవిశ్వాసము గల్గి బ్రహ్మానుభూతిచే జీవితమును ఆనందమయ మొనర్చుకొందురు గాక!

మోక్ష సౌధము యొక్క మూడవ ద్వారపాలకుడు సంతుష్టి (Satisfaction) జీవితకాలములో ఈ సంతుష్టియను

సద్గుణమును అలవఱచుకొనినవారికి. ఆ ద్వారపాలకుడు మోక్ష సౌధ ప్రాంగణమున స్వాగత సత్కారము లొసంగి సగౌరవముగ సౌధాంతరాళములోనికి తీసికొనివెళ్ళి పరమాత్మరూప ప్రభువును సందర్శింపజేయును. ఆహా! ఎట్టి సౌభాగ్యము! కావున సంతుష్టి యను సుగుణరాజమును ముముక్షువు తప్పక ఆశ్రయింపవలెను.

మాయా ప్రభావముచే జీవునకు తనకున్న ఆస్తిపాస్తులందుగాని, కీర్తిప్రతిష్టలందుగాని, సంపదలందు గాని తృప్తి కలుగుటలేదు. ఉన్నదానితో సంతృప్తినొందక ఇంకను కావలెనని ఉబలాటపడుచున్నాడు. దీనివలన అమూల్యమైన సమయము వృథా యగుటయే గాక, అధర్మమార్గములను అవలంభించుటవలన పాపమును గూడ మూటగట్టుకొనుచున్నాడు. కోరిక పెరిగిన ఆశగా మారి, ఆశ పెరిగి తృష్ణగా పరిణమించి, తృష్ణ పెరిగి వ్యసనముగా రూపొంది, వ్యసనము పెరిగి వాసనగా మారిపోయి జీవుని అధోగతికి త్రోసివేయుచున్నది. 'ఆశాపాశశతైర్బద్ధాః' - అని గీతాచార్యులాన తిచ్చినట్లు ఆశలను వందలకొలది త్రాళ్ళచే అజ్ఞానులగు జీవులు బద్ధులై దారి తెన్ను తెలియక ఈ సంసార పథమున నానా విధములుగ సంచరించుచు తుదకు దుఃఖమను మహాగర్తమున పడిపోవుచున్నారు. తృష్ణ యను రక్కసి అవివేకియగు జీవుని కబళించివేయుచున్నది.



నిస్స్వో వష్టి శతం శతీ దశశతం లక్షం సహస్రాధిపో
లక్షేశః క్షితిపాలతాం క్షితిపతిశ్చక్రేశతాం వాంఛతి
చక్రేశః సురరాజతాం సురపతిర్బ్రహ్మస్పదం వాంఛతి
బ్రహ్మ శైవపదం శివో హరిపదం హ్యాశావధిం కోగతః.

అని శాస్త్రకారులు వచించినట్లు—ఏమియు లేనివాడు భగవంతుని నూరు రూప్యములిమ్మని ప్రార్థించుచున్నాడు. ఆ నూరు వచ్చినపుడు అంతటితో తృప్తినొందక వెయ్యికై తిరిగి ప్రార్థించుచున్నాడు. వెయ్యి రాగానే లక్షకొఱకై ఆర్థించుచున్నాడు. లక్ష రాగానే రాజత్వ మపేక్షించుచున్నాడు. రాజత్వము రాగానే ఇంద్రత్వమును కోరుచున్నాడు. ఇంద్రుడు కాగానే బ్రహ్మ పదమును, బ్రహ్మ పదము రాగానే శివపదమును, శివపదము రాగానే విష్ణు పదమును కోరుచు—ఈ ప్రకారముగ అంతులేని ఆశలతో కొట్టుమిట్టాడుచున్నాడు అవివేకియగు జీవుడు.

ఈ తృష్ణారూపరోగనివారణకు ఒకటే మందు కలదు. అదియే సంతుష్టి. జీవితములో ఎచటనో ఒకచోట సంతృప్తి బడయనిదే, 'ఓ భగవంతుడా! నీవిచ్చినది నాకు చాలు. ఎట్లో సంతృప్తి పడి దానితో సర్దుకొని జీవించెదను' అను నిశ్చయము లేనిదే, కోరికలకు ఫుల్‌స్టాప్ (పూర్ణ విరామము) పెట్టనిదే—మానవుడు చుక్కానిలేని పడవవలె జీవితరంగమున నానా వ్యథలకు లోనగుచుండును. కాబట్టి సంతుష్టియే

పరమౌషధము. భవరోగ భేషజము. దానిని సేవించిన జీవుడు పరమశాంతిని బడయగలడు.

పూర్వము శంకర భగవత్పాదాచార్యులను 'మహాత్మా!' ఈ ప్రపంచమున అందఱికంటె దరిద్రుడెవడని ఒకరు ప్రశ్నింప, అమ్మహనీయుడు ఎక్కువ ఆశ కలవాడే దరిద్రుడని వచించెను. అట్లే ఈ ప్రపంచమున అందఱికంటె ధనవంతుడెవడని ప్రశ్నింప ఆ పావనమూర్తి పూర్ణ సంతుష్టి కలవాడే మహాధనికుడని పేర్కొనెను.

కో వా దరిద్రో హి విశాలతృష్ణః
శ్రీమాంశ్చ కో యస్య సమస్తతోషః.

ఇంతియే కాదు. 'కౌపీనవన్తః ఖలుభాగ్యవన్తః' అని సెలవిచ్చి కౌపీనధారియే, వైరాగ్యశీలుడే, సంతుష్టాంతరంగుడే, భగవదైకపరాయణుడే విశ్వమందుగల ధనవంతులలో కెల్ల పరమ ధనవంతుడని శ్రీ శంకరులు వాక్రుచ్చెను. కావున సంతుష్టి యనునది మహత్తర సుగుణరాజమై యలరారుచున్నది. ముముక్షువులెల్లరు దీనిని తప్పక ఆశ్రయించవలసి యున్నది.

సంతుష్టి లేనివానికి, ఆశలు కలవానికి ధ్యానము సరిగా జరుగనే జరుగదు. ధ్యాననిష్ఠలో కూర్చొని యున్నపుడు ఏవియో వాంఛలు, విషయ వ్యామోహము అతనిని వెన్నంటుచునే యుండును. ఆ కోరికలను అనుభవించవలెనని



యతనికి అభిలాష పొడముచుండును. ఒకవేళ అనుభవించినా అంతటితో ఆగునా యనిన, అదియును లేదు. కోరికలు ఎంతెంతగా అనుభవింపబడుచుండునో, అంతంత అధికముగ అవి పెరిగిపోవుచుండును. రెండు యౌవనములు ఏకధాటిగా అనుభవించిన యయాతి తన యనుభవమును గూర్చి తుదకు ఏమి చెప్పెనో ఆలకింపుడు—

న జాతు కామః కామానా ముపభోగేన శామ్యతి
హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే.

కోరికలు అనుభవించుటచేత తరగనే తరగవు. పైగా నిప్పులో నెయ్యిపోసిన చందమున అవి ద్విగుణీకృతముగ పెరిగిపోవును. కావున జీవితమున ఎక్కడో ఒకచోట మనుజుడు తృప్తినొంది మనస్సును దిట్టపఱచుకొని 'ఓ మనసా! జరిగినది చాలును ఇకమీదట నన్ను వేధించకుము' అని దానికి హితము చెప్పి, దృష్టిని పరమాత్మవైపునకు మరలించి సంతుష్టాంతరంగుడై శేషజీవితమును ఆనందముగ గడిపివేయుగాక! సంతుష్టి యను ద్వారపాలకుని ఇచటనే మంచి చేసికొని మోక్షసౌధమున ప్రవేశించి శాశ్వత సుఖమును బడయుగాక!

మోక్షద్వారే ద్వారపాలాశ్చత్వారః పరికీర్తితాః
శమో విచార స్సంతోషశ్చతుర్థస్సాధుసంగమః.

మోక్షద్వారమున నలుగురు ద్వారపాలకులు కలరని శ్రీ యోగవాసిష్ఠమందు వసిష్ఠ మహర్షి పేర్కొనిరి. వారు క్రమముగ (1) శమము, (2) తత్త్వవిచారణ, (3) సంతుష్టి, (4) సజ్జన సాంగత్యము— అనువారు ఈ నలుగురు ద్వారపాలకులలో ముగ్గురను గుఱించి ఇంతదనుక విచారించినాము. ఇక నాల్గవవాడగు సత్సాంగత్యమును గూర్చి ఇపుడు విచారించి ఈ ద్వారపాలకుల ఘట్టమును ఇంతటితో పరిసమాప్తము కావించెదము.

చీకటిలో బోవువానికి దీపముగలవాని సహాయము చాల అవసరము. అవివేకవశమున ప్రపంచము అంధకార బంధురమై యున్నది. జనులు యుక్తాయుక్తములు తెలిసికొనుట లేదు. ఏది సత్యమో ఏది అసత్యమో గ్రహించలేని స్థితిలో ఉన్నారు. దృశ్యప్రపంచము సత్యమని నమ్ముచున్నారు. సత్యస్వరూపమగు పరమాత్మను గూర్చిన పరిచయమే జనులకు లేకున్నది. నామరూపాత్మక జగత్తుయొక్క వ్యామోహములో పడిపోయి ఆయా క్షణిక భోగవిలాసములను గొప్పగ దలంచి వాని వెంట అహర్నిశము పరిగెత్తుచు. తుట్టతుదకు దుఃఖరూప దావానలములో తగుల్కొని నానా వ్యథలను పొందుచున్నారు. పాంచభౌతికమై, వికారవంతమై, బుద్బుదప్రాయమై జడమైనట్టి దేహమును; చైతన్యవంతముగను అత్యంత రమణీయముగను భావించుకొని దానిపైనను, దానికి సంబంధించిన బంధ్వాది దశ్యపదార్థములందును



మమత్వమును పెట్టుకొని, ఆ మమత్వమును క్రమక్రమముగ పెంచుకొని తాపత్రయములచే దగ్ధులై దిక్కుతోచక పరిభ్రమించుచున్నారు. సంసృతి (సుడి)లో చిక్కుకొనిపోయి, గిరగిర తిరుగుచు, పుట్టుచు, చచ్చుచు, కర్మబంధనమున తగుల్కొని, దారి తెన్ను గానక హాహాకారము లొనర్చుచున్నారు.

ఇట్టి విపత్కర స్థితిలో వారికి గత్యంతరమేమి ? అజ్ఞానతమమునబడి నానా యాతనల నొందువానికి జ్ఞానప్రకాశము కలవాడే దిక్కు. అతడే శరణ్యము, కనుకనే సత్సాంగత్యము జీవునకు అవసరమైయున్నది. మహనీయులయొక్క అండదండలు సంసారదుఃఖ పరితప్తునకు అత్యావశ్యకము. వారి యనుగ్రహము. వారి బోధలు, వారి సాంగత్యము. అజ్ఞానపంకపరిమగ్నులకు అవసరములు. శాస్త్రములలో ఎచట చూచినను సత్సాంగత్యముయొక్క మహిమ కొనియాడబడుట కానంబడుచున్నది. ఎంత గొప్పవారైనను ఒకానొక గురువును ఆశ్రయించుటయో, అనుభవజ్ఞులైన మహనీయుల సాంగత్యమును బడయుటయో చరిత్రయందును మనము చూచుచున్నాము. సత్సాంగత్యముయొక్క మహిమను గమనించియే శ్రీ వసిష్ఠమహర్షి మోక్షద్వారపాలకులు నలుగురిలో అర్ధానికి స్థానమొసంగియున్నారు. కావున ముముక్షువులు ఆధ్యాత్మరంగమున ప్రపథమముననే పెద్దల సేవచేసి వారి సాంగత్యశ్రీని అనుభవించి, వారి ప్రేమకు,

అనుగ్రహామునకు పాత్రులై, వారియొక్క బహుకాలార్జిత మగు బ్రహ్మవిజ్ఞానమును, అనుభవపూర్వక పరమార్థ తత్త్వమును తామున్ను సంపాదించి ధన్యులు కాపలయును.

పూర్వము భగీరథుడు గంగను భూలోకమునకు దెచ్చుటకై ఘోరతపంబు సల్పి గంగాదేవిని భూలోకమునకు రమ్మని ప్రార్థింపగా ఆ దేవి 'ఓ రాజా! నేను భూలోకమునకు రాను; నేను వచ్చినచో పాపాత్ములు నాలో స్నానము చేసి వారి పాపమునంతను నాయందు వదలివేయుదురు. ఆ పాపపురాశినంతను నేనెట్లు మోయగలను?' అని పలికెను. గంగాదేవియొక్క ఆ పలుకుల నాలకించి భగీరథు డిట్లు చక్కని సమాధాన మొసంగెను—

సాధవో న్యాసినశ్శాన్తా ధర్మిష్ఠా లోకపావనాః
హరన్త్యఘం తేఽఙ్గసఙ్గా త్తేష్వాస్తేఽఘభిద్ధరిః.

'అమ్మా! తల్లీ! గంగాదేవీ! పాపులు నీలో తమ పాపమును వదలినంతమాత్రముచేత నీకు కలిగిన నష్ట మేమియు లేదు. ఏలయనగా, నీలో కేవలము పాపాత్ములే గాదు, పుణ్యాత్ములుకూడ స్నానము చేయుదురు. సాధు పుంగవులు, త్యాగశీలురు, శాంతస్వభావులు, ధర్మపరాయణులు, లోకపావనతత్పరులు ఎందఱో నీలో స్నానము చేయుచుందురు. వారు తమ పవిత్ర స్పర్శచే ఆ పాపజాలమునంతను దూరీకృత మొనర్చివేయుదురు. పాపహారకుడు శ్రీహరి



వారిలో కాపురముండును. కావున ఇక పాపమెట్లు నిలువ గలదు! వారి స్పర్శమాత్రము చేతనే పాపము పలాయనము చిత్తగించును. కావున తల్లీ! నీకిక భారమేమియు నుండదు, అవతరించుము. భూలోకమునకు విచ్చేయుము.— భగీరథుని యా హేతుపూర్వక వాక్యములను విని గంగాదేవి తక్షణము భూలోకమునకు పయనమయ్యెను.

భాగవతమందలి ఈ గంగావతరణ ఘట్టముద్వారా ఒక గొప్ప సత్యము వెల్లడియగుచున్నది. పుణ్యాత్ములు, తపస్సంపన్నులు, ధ్యాననిష్ఠులు, దైవాయత్తచిత్తులు, తత్త్వ విచారణాపరులు తమ చిత్తములను నిరంతరము భగవంతుని యందు కేంద్రీకరించియుందురు. కాబట్టి వారి వాక్కు, వారి స్పర్శ, వారి సంకల్పము, వారి అనుగ్రహాము మహత్తర శక్తి సమన్వితమై, పాప ప్రభంజకమై, పుణ్యదాయకమై యలరుచుండును. మహాత్ముల సాంగత్యములో ఇట్టి అమోఘ శక్తి యిమిడి యుండుటవలననే శాస్త్రములలో ఎచటచూచినను సత్సాంగత్యముయొక్క ప్రశంసయే కానబడుచున్నది, కావున ముముక్షువులగు సంసార దుఃఖ తరణాలాషులకు, మోక్ష సౌధారోహణతత్పరులకు ఈ సత్సాంగత్యము అవశ్యము ఆశ్రయింపదగియున్నది.

'మహత్సంగస్తు దుర్లభోఽగమ్యోఽమోఘశ్చ'

అని నారదులవారు సత్సహవాసముయొక్క ప్రాశస్త్యమును తమ భక్తి సూత్రములలో వెల్లడించిరి. అనుభవజ్ఞు

లైన పెద్దల సాంగత్యము మహా దుర్లభమైనదనియు, అత్యంత ప్రభావ సంయుక్తమైనదనియు ఆ భక్తశిఖామణి వాక్రుచ్చెను.

కావున మోక్షద్వారపాలకుడగు ఈ సత్సాంగత్యమును జనులు శీఘ్రముగ ఆశ్రయించి తమ బహు జన్మార్జిత హార్దికతమఃపటలమును మహనీయుల జ్ఞాన ప్రకాశ పుంజములచే విచ్ఛిన్న మొనర్చివైచి, క్షణికమగు ఈ జీవితమును విజ్ఞాన సముపార్జనచే సార్థకపఱచుకొని, ఆత్మ సాక్షాత్కారముచే జన్మాది దుఃఖపరంపరను ఛేదించివేసి పరమ శాంతిని బడయుదురుగాక !

## శ్రీ శుకబ్రహ్మాశ్రమ గ్రంథములు

| | | |
|---|---|---|
| 1. | గీతామకరందము | 60-00 |
| 2. | Gita makaranda (English) | 60-00 |
| 3. | వసిష్ఠగీత | 60-00 |
| 4. | రామాయణ రత్నాకరము | 50-00 |
| 5. | భాగవత రత్నాకరము | 50-00 |
| 6. | భారత రత్నాకరము | 50-00 |
| 7. | ఉపనిషద్రత్నాకరము | 45-00 |
| 8. | యోగవాసిష్ఠ రత్నాకరము | 25-00 |
| 9. | గీతోపన్యాసములు | 25-00 |
| 10. | మోక్షసాధన రహస్యము | 25-00 |
| 11. | పరమార్థ కథలు | 25-00 |
| 12. | ఆధ్యాత్మ రామాయణము | 15-00 |
| 13. | బ్రహ్మానంద వైభవము | 15-00 |
| 14. | భజన - కీర్తనలు | 15-00 |
| 15. | అమృత బిందువులు | 15-00 |
| 16. | బ్రహ్మచర్య విజయము | 15-00 |
| 17. | శ్రీ భగవద్గీత (స్థూలాక్షరి) | 12-00 |
| 18 | శ్రీ భగవద్గీత (మూలం) కృష్ణుని రేపరు ప్లాస్టిక్ కవరుతో | 4-00 |
| 19. | వివేకానంద సింహనాదము | 5-00 |
| 20. | యమలోక వార్తలు | 5-00 |
| 21. | శ్రీశ్రీ విద్యాప్రకాశనందగిరిస్వాములవారి జీవిత చరిత్ర | 8-00 |
| 22 | తత్త్వసారము | 4-00 |
| 23. | మానసబోధ | 4-00 |
| 24. | పాండవగీత | 2-50 |